
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 8 । ఏప్రిల్ । 2024



కూల్ కూల్‌గా.. జర్నీ !

వేసవి ఎండల నేపథ్యంలో ఆర్టీసీ ప్రయాణికు లు సాధారణ బస్సుల కంటే ఏసీ బస్సుల వైపే మొగ్గు చూపుతున్నారు. 10లో



చుక్కల్లో చికెన్ ధరలు..!

నిన్న, మొన్నటి వరకు కిలో రూ.220 నుంచి రూ.250 వరకు ఉన్న చికెన్ ధర ఒక్కసారిగా రూ.300కు పెరిగింది. 8లో

గరిష్టం / కనిష్టం
39^{0} / 27^{0}

వాతావరణం

జిల్లాలో సోమవారం ఉదయం నుంచే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం వరకు వడగాలులు వీస్తాయి.

ఇఫ్తార్
(సోమవారం సా॥)
6.29

సహర్
(మంగళవారం ఉ॥)
4.35

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. కాగా ఆదివారం కావడంతో భక్తులు నిత్యకల్యాణంతో పాటు ఆర్జిత సేవలలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి విశేషపూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి ఆదివారం అర్చకులు విశేష పూజలు, రుద్రహోమం నిర్వహించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి జిల్లా నలుమూలలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రుద్రహోమ పూజలో పాల్గొన్న భక్త దంపతులకు అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ సుదర్శన్, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో న్యాయమూర్తి రామారావు



పూజలు చేస్తున్న జడ్జి కుటుంబ సభ్యులు

పెద్దమ్మతల్లి అమ్మవారిని ఆదివారం జిల్లా సీనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అమ్మవారి ప్రసాదాన్ని న్యాయమూర్తికి అందజేశారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం నగరంలోని ఖానాపురం, వైరాలోని బ్రహ్మణపల్లి, ఏన్కూర్ మండలంలోని కేసుపల్లి, కాలనీ నాచారం గ్రామాలతో పాటు జూలూరుపాడులో పర్యటించనున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

‘నవమి’ రైళ్లేవి ?

17న శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం

- రెగ్యులర్ రైళ్లలో బెర్తులన్నీ ఇప్పటికే ఫుల్
- మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ
- ప్రత్యేక రైళ్లు నడిపించాలని భక్తుల వేడుకోలు



శ్రీ సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: శ్రీరామనవమి రోజున సీతారాముల కల్యాణాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు భద్రాచలం వస్తుంటారు. ఈసారి లక్ష మందికి పైగా భక్తులు వస్తారనే అంచనాతో ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంత భారీ స్థాయిలో భక్తులు వచ్చే పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయడంలో రైల్వే శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

నాట్ అవైలబుల్..

తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు ప్రతీ ఏటా శ్రీరామ నవమికి భద్రాచలం వస్తుంటారు. హైదరాబాద్ నగరం నుంచి కూడా భారీ స్థాయిలో భక్తులు ఈ వేడుకలకు హాజరవుతారు. భద్రాచలం చేరుకునేందుకు దగ్గరగా భద్రాచలంరోడ్ (కొత్తగూడెం) రైల్వే స్టేషన్ ఉంది. ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి నిత్యం మూడు రైళ్లు భద్రాచలంరోడ్ స్టేషన్‌కు నడుస్తున్నాయి. ఈ మూడు రైళ్లలో ఏప్రిల్ 15 నుంచి 18 వరకు ఇరువైపులా స్లీపర్ క్లాస్ మొదలు, ఏసీ త్రీటైర్, టూ టైర్‌లో టికెట్లు పూర్తిగా అమ్ముడైపోయాయి. కనీసం వెయిటింగ్ లిస్ట్ కూడా చూపించడం లేదు. ఇక గుంటూరు, విజయవాడ, రాజమండ్రి నుంచి వచ్చే భక్తులు డోర్నకల్‌లో దిగి ఈ మూడు రైళ్లలో ఏదో ఒకటి ఎక్కాల్సి వస్తోంది. రామగుండం, కరీంనగర్, కాగజ్‌నగర్, బెల్లంపల్లి నుంచి భద్రాచలం వచ్చేందుకు సింగరేణి ఎక్స్‌ప్రెస్ మినహాయిస్తే మరో రైలు లేదు. దీంతో నవమి వేడుకలు కళ్లారా చూడాలనుకునే భక్తులకు ప్రయాణం ఇబ్బందిగా మారింది.

ప్రైవేటు బస్సుల్లో ఇష్టారీతిన ధరలు..

ఇరు రాష్ట్రాలకు చెందిన ఆర్టీసీ సంస్థలు భద్రాచలానికి వందల సంఖ్యలో నడిపిస్తున్న బస్సుల్లో సీట్లన్నీ ఏప్రిల్ 16 నుంచి 18 వరకు ఇప్పటికే రిజర్వ్ అయిపోయాయి. దీంతో ప్రైవేట్ బస్సులే దిక్కుగా మారాయి. నవమికి డిమాండ్ పెరిగిపోవడంతో ప్రైవేట్ ఆపరేటర్లు ఇష్టారీతిగా టికెట్ ధరలు నిర్ణయిస్తున్నారు. సాధారణ రోజుల్లో ప్రైవేటు ఆపరేటర్లు భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు రూ. 700 నుంచి రూ.900 వరకు చార్జ్ చేస్తుండగా, నవమి రోజుల్లో ఈ ధర రూ.1200కు చేరుకుంటోంది. ఏపీలోని పలు పట్టణాలకు సైతం ఇదే తీరున టికెట్ ధరలు పెంచేశారు. కుటుంబ సమేతంగా కల్యాణానికి వచ్చే భక్తులకు పెరిగిన ధరలు భారంగా మారాయి.

16 నుంచి 18 వరకు ప్రత్యేక రైళ్లు నడపాలి..

గతంతో పోల్చితే మహాలక్ష్మి పథకం(మహిళలకు ఉచిత ప్రయాణం) కారణంగా ఆర్టీసీ బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగింది. నిల్చుని ప్రయాణం చేయాల్సి వస్తోంది. నవమి రద్దీకి అనుగుణంగా సికింద్రాబాద్, రాజమండ్రి, విజయవాడ/గుంటూరు, రామగుండం వంటి నగరాల నుంచి భద్రాచలం రోడ్ స్టేషన్‌కు ప్రత్యేక రైళ్లు నడిపించాలని భక్తులు కోరుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల ఇబ్బందులను గమనించి, ఏప్రిల్ 16 నుంచి 18 వరకు ప్రత్యేక రైళ్లు నడిపించాలని అంటున్నారు. ప్రస్తుతం నడుస్తున్న రైళ్లకు అదనపు బోగీలు జత చేయాలని కోరుతున్నారు.

బ్రహ్మోత్సవాలకు రెడీ..



మిథిలా స్టేడియం ప్రవేశద్వారానికి రంగులు వేస్తున్న కార్మికులు



భద్రాచలంలో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

- ఉగాది పర్వదినం నుంచి వేడుకలు
- ఈ నెల 23 వరకు తిరుకల్యాణ ఉత్సవాలు
- భద్రాచలంలో ముమ్మరంగా నవమి ఏర్పాట్లు

భద్రాచలం: భద్రగిరి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతోంది. శ్రీ సీతారామ చంద్రస్వామివారి కల్యాణమహోత్సవం వైభవంగా జరపనున్నారు. శ్రీరామనవమి ఉత్సవాలకు ఉగాది పర్వదినాన శాస్త్రోక్తంగా అంకురార్పణ జరగనుంది. క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం.. మంగళవారం రోజు ప్రత్యేక పూజలతో వసంత పక్ష తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 17న శ్రీరామనవమి, 18న మహాపట్టాభిషేకం నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

రేపు క్రోధి నామ సంవత్సరాదితో అంకురార్పణ

ఈ ఏడాది నుంచి బ్రహ్మోత్సవాలను ఉగాది రోజున అంకురార్పణ చేయనున్నట్లు వైదిక కమిటీ తెలిపింది. మంగళవారం నూతన సంవత్సరాది సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు మూలవరులకు ప్రత్యేక అభిషేకం (తిరుమంజనం) జరగనుంది. ప్రతీ ఆదివారం మాత్రమే జరిగే ఈ అభిషేకం ఏడాదిలో ఐదురోజులపాటు ప్రత్యేకంగా జరపడం ఆలయంలో ఆనవాయితీగా వస్తోంది. ఉగాది, శ్రీరామనవమి, వైశాఖ పునర్వసు, నరకచతుర్దశి, వైకుంఠ ఏకాదశి రోజుల్లో మాత్రమే ప్రత్యేకంగా అలకరించి అభిషేకం చేస్తారు. ఆస్థాన పురోహితులచే పంచాంగ శ్రవణం జరుగుతుంది. వేప పూత పచ్చడిని నివేదన చేసి భక్తులందరికీ పంచుతారు.

నిత్యకల్యాణాలు, పవళింపు సేవలు రద్దు

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అయితే దేవస్థానం విడుదల చేసిన షెడ్యూల్‌కు భిన్నంగా బ్రహ్మోత్సవాలు జరుగుతాయని వైదిక కమిటీ ఇప్పటికే పేర్కొంది. షెడ్యూల్ ప్రకారం 13 నుంచి 15వ తేదీ వరకు ఆలయంలో జరిగే కార్యక్రమాలన్నీ.. ఉగాది మరుసటి రోజు నుంచి జరగనున్నాయి. 16న ఎదుర్కోలు ఉత్సవం నుంచి యథావిధిగా షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు ఉండనున్నాయి. 17న సీతారాముల కల్యాణం, 18న మహా పట్టాభిషేకం, 19న మహా దాశీర్వచనం, 20న తెప్పోత్సవం, దొంగల దోపు, 21న ఊంజల్ ఉత్సవం, 22న వసంతోత్సవం, 23న పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 9 నుంచి 23 వరకు బేడా మండపంలో జరిగే నిత్యకల్యాణాలు, దర్బారు సేవలను రద్దు చేశారు. మే 2వ తేదీ నుంచి పర్యంతోత్సవం, పవళింపు సేవలు ప్రారంభమవుతాయి.

ముమ్మరంగా ఏర్పాట్లు..

శ్రీరామనవమికి సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. బ్రిడ్జి సెంటర్‌లో, అభయాంజనేయ స్వామి, సూపర్ బజార్, కరకట్ట దిగువ భాగాన తదితర ప్రదేశాల్లో స్వాగత ద్వారాలను ఏర్పాటు చేశారు. ఉత్తర ద్వారం వద్ద స్వాగత ద్వార పనులు నడుస్తున్నాయి. భక్త రామదాసు విగ్రహానికి కొత్తగా పంచరంగులను అద్దారు. చలువ పందిళ్లు, స్టేడియంలో సెక్టార్ల విభజనకు సంబంధించిన పనులు నడుస్తున్నాయి. విద్యుత్ దీపాల అలంకరణ సైతం పూర్తి కావొస్తుంది. కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశాల మేరకు భక్తులు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో రమాదేవి తెలిపారు.

‘ఎర్లీబర్డ్’పై ప్రచారమేదీ?

- ఆస్తిపన్ను ముందుగా చెల్లిస్తే 5 శాతం రాయితీ
- ఉమ్మడి జిల్లాలో స్పందన నామమాత్రమే
- ఈనెల 30తో ముగియనున్న గడువు



ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం

సత్తుపల్లిటౌన్: ఆస్తి పన్నుపై ఐదు శాతం రాయితీ కల్పించే ఎర్లీబర్డ్ పథకంపై ప్రచారం కరువైంది. మున్సిపాల్టీలు, నగరపాలక సంస్థల్లో ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం గడువు ఈ నెల 30వ తేదీతో ముగియనుంది. ఆస్తిపన్ను మొత్తం ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీ కల్పిస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. ఏప్రిల్ 1 నుంచి 30వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇల్లెందు, సత్తుపల్లి మున్సిపాల్టీల్లో మాత్రమే ఐదుశాతం రాయితీ పథకంపై స్పందన కనిపిస్తోంది. మిగతా మున్సిపాల్టీల్లో వసూళ్లు అంతంతమాత్రంగానే ఉన్నాయి.

బకాయిలు పేరుకుపోతుండడంతో..

మున్సిపాల్టీలు, నగరపాలక సంస్థలకు ప్రధాన ఆదాయ వనరు పన్నులే. ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే పన్నులు వసూలు చేయగలిగితే తప్ప.. పూర్తి స్థాయిలో రాబట్టడం సాధ్యపడడం లేదని గమనించిన పురపాలక శాఖ ఎర్లీబర్డ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆస్తి పన్ను బకాయిలు మున్సిపాల్టీల్లో పేరుకుపోవడంతో అభివృద్ధి పనులు వెనుకబడుతున్నాయి. దీంతో పాటు సిబ్బంది, కార్మికుల జీతభత్యాలకు, బిల్లుల చెల్లింపులకు మున్సిపాల్టీలు సతమతం అవుతున్నాయి.

గతేడాది పన్ను చెల్లించిన వారే..

2023 – 24 ఆర్థిక సంవత్సరంలో నివాస, నివాసేతర ఆస్తిపై ఎలాంటి బకాయి లేకుండా పూర్తిగా పన్ను చెల్లించిన వారు మాత్రమే ఎర్లీబర్డ్ పథకానికి అర్హులు. రాయితీ పొందాలనుకునే వారు గతేడాది తమ ఆస్తిపన్నును పూర్తిగా చెల్లించి ఈ ఏడాది ముందస్తుగా చెల్లిస్తే 5 శాతం రాయితీ వర్తిస్తుంది.

మున్సిపాల్టీ	ఎసెస్‌మెంట్లు	డిమాండ్ (రూ.కోట్లలో)	రాయితీపై వసూలైనవి(%)
ఖమ్మంకార్పొరేషన్	80,132	68.88	0.77
సత్తుపల్లి	9713	5.53	2.17
మధిర	8699	3.51	1.42
వైరా	7114	3.5	0.83
కొత్తగూడెం	22240	12.99	0.31
మణుగూరు	7534	2.23	0.90
పాల్వంచ	23370	28.42	0.46
ఇల్లెందు	8357	2.45	2.45

సద్వినియోగం చేసుకోండి



ఈ ఏడాది ఆస్తి పన్ను ముందుగానే పూర్తిగా చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వం 5 శాతం రాయితీ అవకాశం కల్పించింది. ఈ నెల 30వ తేదీలోగా భవన యజమానులు, వ్యాపారులు ఆస్తి పన్ను చెల్లించి ఎర్లీబర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ పథకంపై బల్క్ ఎస్ఎంఎస్‌లు, భవన యజమానులకు ఫోన్లు చేస్తూ అవగాహన కల్పిస్తున్నాం.

– మందా రవిబాబు, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి

నేడు ఆర్‌డబ్ల్యూస్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాక

అశ్వాపురం: ఆర్‌డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి, సీఈ శ్రీనివాస్, ఎస్ఈ సదాశివకుమార్ సోమవారం మండలంలో పర్యటించనున్నారు. మండలంలోని కుమ్మరిగూడెం గ్రామంలో ఉన్న మిషన్ భగీరథ ఇన్‌టేక్‌వెల్‌ను సందర్శించనున్నారు. జిల్లాలో మిషన్ భగీరథ నీటి సరఫరాపై సమీక్ష నిర్వహించనున్నారు.

క్రోధి నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ

ఖమ్మంగాంధీచౌక్: నూతన తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం ఖమ్మం జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర పంచాగాన్ని ఆదివారం ఖమ్మంలోని జలాంజనేయ స్వామి దేవాలయంలో ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సురావఝల వాసుశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రతినిధులు తాటికొండాల సీతారామ శాస్త్రి, ఈశ్వరప్రగడ హరిబాబు, హెచ్‌వీఎల్ ప్రసాద్ బాబు, కోసూరు ప్రసాద్, గెంట్యాల శ్రీనివాస రావు, ముడుంబై శ్రీకాంత్, శ్రీధర శర్మ, మాటేటి వేణుగోపాల్ రావు, సన్నిధానం జగన్నాధానం, సరస్వతి కుమార్, శ్రీదేవి, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి కుళాయినీళ్లు..

- వేసవి పూర్తయ్యేవరకు పక్కా ప్రణాళికతో సరఫరా
- మిషన్ భగీరథ గ్రిడ్‌ను సందర్శించిన కలెక్టర్ ప్రియాంక



మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక తదితరులు

పాల్వంచరూరల్: రానున్న రెండు నెలల్లో పక్కా ప్రణాళికతో తాగునీరు సరఫరా చేయాలని, వేసవికాలం పూర్తయ్యే వరకు ప్రతీ ఇంటికి కుళాయిల ద్వారా అందించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. మండల పరిధిలోని తోగ్గూడెం వద్ద ఉన్న మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్ ప్లాంట్‌ను ఆదివారం కలెక్టర్ సందర్శించారు. గ్రిడ్‌లో తాగు నీటి శుద్ధి కేంద్రం ప్లాంట్, నిల్వ సామర్థ్యం, సరఫరా, రోజువారీ డిమాండ్, సరఫరా జరిగే ప్రాంతాలు తదితర వివరాలు గ్రిడ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రెండు నెలలు చాలా కీలకమని, తాగునీటి సరఫరాలో లోటుపాట్లు ఉంటే సరిదిద్దుకోవాలని పేర్కొన్నారు. మిషన్ భగీరథ ఏఈలు అందుబాటులో ఉండాలని, గ్రిడ్ నుంచి నీటి సరఫరా జరగని ప్రాంతాల్లో స్థానిక వనరులైన బావులు, బోర్ల ద్వారా నీళ్లు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాటర్ ట్యాంక్‌ల్లోని నీళ్లు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, క్లోరినేషన్ చేయాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న చేతిపంపులు, మిషన్ భగీరథ పైపులైన్లకు మరమ్మతులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ తిరుమలేష్, తహసీల్దార్ వివేక్, ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి, గ్రిడ్ డీఈ సాయిలు ఉన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తం

- రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో జిల్లా
- ఎన్నికల సిబ్బందికి మొదటి దశ శిక్షణ పూర్తి
- నూతన ఓటర్ల నమోదుకు ఈ నెల 29 వరకు గడువు



దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్లతో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

సూపర్‌బజార్(కొత్తగూడెం): లోక్‌సభ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతోంది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఇందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, కొత్తగూడెం, అశ్వారావుపేట ఖమ్మం పార్లమెంట్ స్థానం, భద్రాచలం, ఇల్లెందు, పినపాక మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలో ఉన్నాయి. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు ఏఆర్‌ఓలను, ఎన్నికల సిబ్బందిని నియమించారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు వివిధ కమిటీలను ఏర్పాటు చేశారు. కొత్తగూడెం, పాల్వంచలలో ఎన్నికల సిబ్బందికి మొదటి దశ శిక్షణ కార్యక్రమాన్ని కూడా పూర్తి చేశారు. ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని కల్పించి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. దివ్యాంగులు, 85 ఏళ్లు దాటిన వృద్ధులు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునేలా కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో 85 సంవత్సరాలు దాటిన వృద్ధులు 6,481 మంది, దివ్యాంగులు 14,021 మంది ఉన్నారు.

ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక జిల్లాలో రాజకీయ నాయకులు విగ్రహాలకు, స్తూపాలకు ముసుగులు వేశారు. రాజకీయ పరమైన ఫ్లెక్సీలు తొలగించారు. కోడ్ అమలుకు ప్రత్యేకాధికారులను నియమించారు. ఆరుగురు వ్యయ పరిశీలకులు, ఐదుగురు అకౌంటెంట్లు, 30 మందితో ఎంసీఎంసీ కమిటీ, 16 మందితో ఫ్లయింగ్ స్క్వాడ్, 15 మంది స్టాటిక్ సర్వైలెన్స్ ఆఫీసర్లు, 18 మంది వీడియో సర్వైలెన్స్ సిబ్బందిని జిల్లా ఎన్నికల అధికారి నియామకం చేపట్టారు.

1,109 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం 1,109 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. పినపాకలో 250, కొత్తగూడెంలో 253, ఇల్లెందులో 242, అశ్వారావుపేటలో 184, భద్రాచలంలో 180 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఆయా కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. శాసనసభ ఎన్నికల సమయంలో జిల్లాలో 9,84,620 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 4,78,098, మహిళలు 5,06,471 మంది, ఇతరులు 60 మంది ఉన్నారు. నూతనంగా ఓటు నమోదు చేసుకునే వారికి ఈ నెల 29వ తేదీ తుది గడువుగా ప్రకటించారు.

ఓటరు చైతన్యానికి అవగాహనా కార్యక్రమాలు

లోక్‌సభ ఎన్నికలలో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమాలలో భాగంగా ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే నినాదంతో జిల్లా కేంద్రంలో 5కే రన్ నిర్వహించారు. దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్లతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి సమావేశాలను నిర్వహిస్తున్నారు.

ఎన్నికలకు సిద్ధమవుతున్నాం



లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్నాం. జిల్లావ్యాప్తంగా 1,109 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నాం. పోలింగ్ ప్రక్రియకు 1,401 మంది పీఓలు, 1,401 ఏపీఓలు, 2,827 మంది ఓపీఓలను నియమించాం. పోలింగ్ సిబ్బందికి మొదటి విడత శిక్షణ పూర్తి చేశాం. నోడల్ అధికారులకు శిక్షణ పూర్తి చేశారు. ఎన్ఐసీ రూపొందించిన సాఫ్ట్‌వేర్ వినియోగించి పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ పూర్తి చేశారు.

–డాక్టర్ ప్రియాంక ఆల, జిల్లా ఎన్నికల అధికారి

కాంగ్రెస్ గూటికి ఎమ్మెల్యే తెల్లం



కాంగ్రెస్‌లో చేరాక సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటితో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కార్యకర్తలు

భద్రాచలం: భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ గూటికి చేరారు. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ ఖాళీ అయింది. ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంకట్రావు, ఆయన అనుచరులకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శనివారం తుక్కుగూడలో జరిగిన సభలోనే ఈ చేరిక ఉంటుందని భావించినా జరగలేదు. 2018లో భద్రాచలం ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన వెంకట్రావు, గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు పొంగులేటితోపాటు కాంగ్రెస్‌లో చేరారు. అక్కడ అసెంబ్లీ టికెట్ వచ్చే పరిస్థితి లేకపోవడంతో చివరి నిమిషంలో మళ్లీ బీఆర్ఎస్‌లో చేరి, ఎమ్మెల్యేగా గెలిచారు. గెలిచిన కొద్ది నెలల్లోనే మళ్లీ పొంగులేటి ద్వారానే కాంగ్రెస్‌లో చేరారు. వెంకట్రావుతోపాటు చేరిన వారిలో బొలిశెట్టి రంగారావు, శ్రీనివాస్, రాము, రాజీవ్, విజయ్ ఉన్నారు.

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశారు

ఎమ్మెల్సీ తాతా మధు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు

భద్రాచలం: భద్రాచలం ఏజెన్సీని అభివృద్ధి చేస్తానంటూ బీఆర్ఎస్ తరఫున గెలిచి విలువలకు తిలోదకాలు ఇచ్చి కాంగ్రెస్‌లో చేరిన తెల్లం వెంకట్రావు ఏజెన్సీ నియోజకవర్గ ద్రోహి అని ఎమ్మెల్సీ తాతా మధు విమర్శించారు. ఆదివారం భద్రాచలంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డబ్బులకు అమ్ముడుపోయిన వెంకట్రావు శాసనసభ సభ్యత్వాన్ని సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీపై నమ్మకంతో ప్రజలు వెంకట్రావును గెలిపిస్తే, వారి నమ్మకాన్ని వమ్ము చేశారని ఆరోపించటంతోపాటు పరుష వ్యాఖ్యలు చేశారు. సమావేశంలో నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, అన్నెం సత్యాలు, తాండ్ర వెంకటరమణారావు, సునీల్, వాసు రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'మ్యాన్ రైడింగ్' ప్రారంభానికి సిద్ధం


గనిలో పనిచేసేందుకు వచ్చిన కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే–5 ఇంక్‌లైన్ గనిలో రూ.9.2 కోట్లతో కంపెనీ ఏర్పాటు చేసిన మ్యాన్ రైడింగ్ సిద్ధంగా ఉంది. గనిలో కార్మికులు సుమారు రెండు కిలోమీటర్ల దూరం నడవడంతో పాటు గనిలో పనిచేయడం కష్టతరంగా మారుతుంది. ఈ నేపథ్యాన పలు కార్మిక సంఘాల విజ్ఞప్తి మేరకు గతేడాది యాజమాన్యం మ్యాన్ రైడింగ్ పనులను ఆప్మెయిల్ కంపెనీ (విజయవాడ)కు అప్పగించింది. గనిలో కార్మికుల గైర్హాజరు కారణంగా ఎరక్షన్ పనులు కొంత జాప్యం జరుగుతోంది. దీంతో ఇటీవల డీజీఎంఎస్ పర్యవేక్షణలో మ్యాన్ రైడింగ్ పనులు స్పీడ్ చేయాలని ఆదేశించనట్లు తెలిసింది. ఈ నేపథ్యాన ఏరియా ఉన్నతాధికారులు పనులను వేగవంతం చేసి మ్యాన్ రైడింగ్‌ను స్పీడ్ చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. మ్యాన్ రైడింగ్‌కు సంబంధించిన ఇంకా కొన్ని పనులు మరో రెండు, మూడు రోజుల్లో పూర్తికానున్నాయని, పనులు పూర్తయిన వెంటనే సంస్థ ఉన్నతాధికారుల చేతుల మీదుగా ప్రారంభించనున్నామని గని మేనేజర్ పొలడుగు శ్రీనివాస్ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత..

పాల్వంచరూరల్: మొర్రేడువాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. వివరాలిలా.. మున్సిపాలిటీ పరిధిలోని బంగారుజాల నుంచి అక్రమంగా ఇసుకనుతరలిస్తున్న లారీని ఆదివారం పాల్వంచ అటవీశాఖ రేంజర్ అనిల్ కుమార్ పట్టుకుని సీజ్ చేశారు. ఆతర్వాత లారీ యజమాని నానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

అశ్వారావుపేట(ములకలపల్లి): గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై ఆదివారం ములకలపల్లి పోలీసులు దాడి చేశారు. మండలపరిధిలోని సత్యంపేట గ్రామ శివారులో పేకాట నిర్వహిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈమేరకు దాడులు నిర్వహించి, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1,560 నగదు స్వాధీనం చేసుకున్నారు.

బెల్ట్ దుకాణాలపై అధికారుల దాడి

అశ్వారావుపేటరూరల్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యాన అక్రమంగా నిర్వహిస్తున్న పలు బెల్ట్ దుకాణాలపై ఆదివారం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు దాడి చేశారు. మండలంలోని నారంవారిగూడెం, ఆసుపాక గ్రామాల్లో స్క్వాడ్ అధికారి ఎల్.కృష్ణ, స్థానిక పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారుల ఆధ్వర్యాన దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మొత్తం రూ.26వేల విలువ చేసే అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. అదే విధంగా ఇద్దరు బెల్ట్ దుకాణాలదారులపై కేసు నమోదు చేసినట్లు స్థానిక అదనపు ఎస్సై శివరామకృష్ణ తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

అశ్వారావుపేట(ములకలపల్లి): తిమ్మంపేటలో అక్రమంగా నిల్వ చేసినట్లు మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి, వివిధ బ్రాండ్లకు చెందిన రూ.2,970 విలువ గల 15 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఎంహెచ్ 7, ఐబీ 3, ఎంసీ డైట్ 3, ఆర్ఎస్ 2 బాటిళ్లు ఉండగా.. ఒకరిపై కేసు నమోదు చేశారు. పై రెండు ఘటనలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజమౌళి తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఇల్లెందు: భార్యను తరచూ కొడుతున్న భర్తపై ఆదివారం ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన కాకటి రమేష్ అతడి భార్యను మద్యం సేవించిన సమయాన తరచూ కొట్టేవాడు. కుమార్తె ఆవేదన మేరకు ఆమె తండ్రి ముత్తయ్య ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

బస్టాండ్‌లో ఉద్రిక్తత


ఆందోళన చేస్తున్న బాధితురాలు, ఇతరులు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం రాత్రి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఓ ప్రయాణికురాలు వాటర్ బాటిల్ కొనుగోలు చేసే సమయాన బస్టాండ్‌లోని ఓ షాపు యజమాని హాట్ వాటర్ లేదా కూల్ వాటర్ అంటూ అసభ్యంగా ప్రవర్తించడంతో అక్కడ ఉన్న తోటి ప్రయాణికులతో పాటు మహిళ కుటుంబ సభ్యులు షాపు ఎదుట ఆందోళన చేశారు. మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని అక్కడి ప్రయాణికులు డిమాండ్ చేశారు. దీంతో స్పందించిన ఆర్టీసీ అధికారులు విచారణ జరిపించి షాపు యజమానిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

చుక్కల్లో చికెన్ ధరలు..!

రూ.300 పైగా పలుకుతున్న చికెన్ ధర

- డిమాండ్‌కు తగిన ఉత్పత్తి లేకనే అధిక రేటు
- పండుగలు, పెళ్లిళ్లతో డిమాండ్
- దాణా, కోడి పిల్ల, నిర్వహణ ధరలు పెరగటం మరో కారణం
- ఉష్ణోగ్రతల కారణంగా కోళ్ల పెంపకానికి వెనుకంజ


చుంచుపల్లి: మార్కెట్లో చికెన్ అమ్మకాలు

చుంచుపల్లి/భద్రాచలం(భద్రాచలంటౌన్)/ఖమ్మం వ్యవసాయం: చికెన్‌కు డిమాండ్ పెరిగింది. నిన్న, మొన్నటి వరకు కిలో రూ.220 నుంచి రూ.250 వరకు ఉన్న చికెన్ ధర ఆదివారానికి ఒక్కసారిగా పెరిగింది. ప్రాంతం, డిమాండ్ ఆధారంగా కిలో చికెన్ రూ.300 పైగానే విక్రయిస్తున్నారు. ఓ వైపు పండుగలు, మరో వైపు శుభకార్యాల సీజన్ కావటంతో చికెన్ వినియోగం గణనీయంగా పెరిగింది. వినియోగానికి తగిన విధంగా కోళ్ల ఉత్పత్తి లేకపోవటంతో ధరకు రెక్కలొచ్చాయి. సాధారణంగా వేసవి కాలంలో ఉష్ణోగ్రతల కారణంగా కోళ్ల ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం అదే పరిస్థితి కొనసాగుతోంది. దాణా ధరలు, కోడిపిల్లల ధరలు పెరగటం, వేసవిలో నిర్వహణ ఖర్చులు పెరగటం కూడా చికెన్ ధరలు పెరగటానికి కారణాలుగా కోళ్ల పరిశ్రమల నిర్వాహకులు చెబుతున్నారు.

ఉత్పత్తి పడిపోయింది..

ప్రస్తుతం చికెన్‌కు ఉన్న డిమాండ్‌కు తగిన విధంగా కోళ్ల ఉత్పత్తి జరగటం లేదు. మార్కెట్‌లో వ్యాపారుల నుంచి ఆర్డర్లు పెరగటంతో అందుకు అనుగుణంగా ఉత్పత్తులు లేకపోవటంతో కంపెనీలు రేట్లు పెంచుతున్నాయి. పరిశ్రమల వద్ద లైవ్ బర్డ్ ధర పెరగటంతో దాని ప్రభావం చికెన్ ధరపై పడుతోంది. నెల రోజుల కిందట తెలంగాణ కుంభమేళాగా జరిగిన మేడారం జాతరతో కోళ్లు, చికెన్ ధరలు పెరిగాయి. జాతర తరువాత తగ్గిన చికెన్ ధరలు మళ్లీ పెరిగాయి. నెల రోజులకు పైగా వివాహాలు, గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాలు జరుగుతుండటంతో మాంసాహారాల వినియోగం బాగా పెరిగింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇటీవలి కాలంలో నిత్యం 80 నుంచి 90 టన్నుల వరకు చికెన్ వినియోగం జరుగుతున్నట్లు అంచనా. ఒక్క ఖమ్మం నగరంలోనే దాదాపు 25 నుంచి 30 టన్నుల వరకు వినియోగం ఉన్నట్లు వ్యాపార వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఉన్న పరిశ్రమల్లో 60 లక్షలకు పైగా కోళ్లను పెంచేందుకు అవకాశం ఉన్నప్పటికీ గత అనుభాలు, ఇతర కారణాలతో ప్రస్తుతం 40 నుంచి 45 లక్షల కోళ్ల పెంపకం జరుగుతున్నట్లు కోళ్ల పరిశ్రమల నిర్వాహకులు చెబుతున్నారు. వినియోగానికి తగిన విధంగా ఉత్పత్తి లేకపోవటంతో ధర పైపైకి పోతోందని వ్యాపారులు విశ్లేషిస్తున్నారు.

పండుగలు, పెళ్లిళ్లతో..

ప్రస్తుతం హిందూ, ముస్లింల పండుగలైన ఉగాది, రంజాన్‌లు ఓ వైపు, మరో వైపు పెళ్లిళ్ల సీజన్ కావటంతో చికెన్‌కు బాగా డిమాండ్ పెరిగింది. మంగళవారం ఉగాది పండుగ, గురు, శుక్రవారాల్లో రంజాన్ పండుగ ఉండటంతో చికెన్‌కు వ్యాపారుల నుంచి ఆర్డర్లు బాగా పెరిగాయి. ఇదే తరుణంలో పెళ్లిళ్లు ఉండటంతో ఆ డిమాండ్ కూడా కొనసాగుతోంది. శుభ ముహూర్తాల కాలం కావటంతో ప్రతి ఇంటా ఉప్పలమ్మ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో చికెన్‌కు ధరలు పెరుగుతున్నాయి. మొక్కజొన్న వంటి పంటల ఉత్పత్తి తగ్గిపోవటంతో దాణా ధర పెరిగింది. ఇక హేచరీస్‌లో కోడి పిల్లల ధర పెరిగింది. రూ.25 నుంచి రూ.30 ఉన్న కోడి పిల్ల ధర ప్రస్తుతం రూ.53గా పలుకుతోంది. ఇక నిర్వహణ ఖర్చులు పెరిగాయి. వేసవిలో కోళ్ల పరిశ్రమల నిర్వహణకు అదనంగా ఖర్చవుతుంది. ఏసీల వినియోగం పెరగటంతో నిర్వహణ ఖర్చులు పెరుగుతాయి. ఇక ప్రస్తుతం 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో కోళ్లు తట్టుకోలేవు. ఉష్ణోగ్రతలు, వడగాల్పులు కాలం కావటంతో కోళ్ల పరిశ్రమకు నష్టం జరుగుతుందని భావించి నిర్వాహకులు, రైతులు కోళ్ల పెంపకానికి వెనుకంజ వేస్తున్నారు. ఉష్ణోగ్రతలతో కోళ్లు చనిపోతే కోలుకోలేని దెబ్బ పడుతుంది. కోళ్లు సాధారణంగా 40 రోజుల్లో 2.3 కిలోల బరువు పెరుగుతుంది. కానీ, వేసవిలో 48 రోజులు పడుతుంది. ప్రస్తుతం ఒక కోడి పెంపకానికి రూ.125 నుంచి రూ.135 వరకు ఖర్చవుతోంది. కంపెనీలు ప్రస్తుతం రూ.140 వరకు విక్రయిస్తున్నాయి. దీంతో రిటైల్‌గా స్కిన్‌లెస్ రూ.300 నుంచి రూ.320 వరకు విక్రయిండగా, విత్‌స్కిన్ రూ.280గా, లైవ్‌కోడి రూ.170 వరకు విక్రయిస్తున్నారు.

చికెన్ ధర ప్రియం



చికెన్ ధర ప్రియంగా మారింది. గతంతో పోలిస్తే దాదాపుగా రెట్టింపు ధరకు చేరింది. కిలో చికెన్ ధర రూ.300 కావటంతో వినియోగాన్ని తగ్గించాల్సి వచ్చింది. ప్రతి ఆదివారం చికెన్‌కు రూ.200 నుంచి రూ.220 వరకు వెచ్చిస్తాం. అలాంటిది రూ.300 పెట్టినా కేజీ రావటం లేదు. మటన్ ధరతోపాటు చికెన్ ధర కూడా అందుబాటులో లేకుండా పోతోంది.

– శీలం కార్తీక్, నాయుడుపేట, ఖమ్మం

ఉత్పత్తి లేకనే..



కోళ్ల ఉత్పత్తి లేకనే చికెన్ ధరలు పెరిగాయి. వివిధ కారణాలతో కోళ్ల పెంపకం తగ్గింది. వేసవిలో కోళ్ల పెంపకం భారంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయి. కోడిపిల్ల ధర బాగా పెరిగింది. వేసవిలో పెంపకం ఇబ్బందిగా ఉంటుంది. నిర్వహణ ఖర్చులు పెరిగాయి. డిమాండ్ తగిన ఉత్పత్తి లేకపోవడంతో ధరలు పెంచడం అనివార్యమైంది.

– రావి బాబూరావు, పౌల్ట్రీ పరిశ్రమ యజమాని, ఖమ్మం

కేసులకు భయపడొద్దు.. అండగా ఉంటాం

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర


సమావేశంలో పాల్గొన్న ఎంపీలు వద్దిరాజు, నామా, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తదితరులు

జూలూరుపాడు: బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులకు పార్టీ అండగా ఉంటుందని, కేసులకు భయపడాల్సిన అవసరం లేదని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఆదివారం జూలూరుపాడులో బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తలు, నాయకులతో జరిగిన సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌లతో కలిసి హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ బలమైన రాజకీయ పార్టీ అని, అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు పెట్టే కేసులకు భయపడొద్దని, అన్ని వేళల అండగా ఉంటామన్నారు. నామా నాగేశ్వరరావు గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నామా మాట్లాడుతూ.. మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌దే భవిష్యత్ అన్నారు.ఖమ్మం ఎంపీ స్థానం నుంచి పోటీ చేస్తున్న తనను రెండోసారి తిరిగి గెలిపించాలని కోరారు. అంతేకాక రైతులకు ఎకరానికి రూ.25 వేల నష్ట పరిహారంతో పాటు కాంగ్రెస్ హామీ ఇచ్చిన మేరకు వరిపంటకు రూ.500లు బోనస్ ఇవ్వడంతోపాటు ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు యల్లంకి సత్యనారాయణ, తాళ్లూరి జీవన్‌కుమార్, జూలూరుపాడు జెడ్పీటీసీ భూక్యా కళావతి, ఎంపీటీసీ బానోత్ నీల, పోలుదాసు గోపాలకృష్ణమూర్తి, లకావత్ గిరిబాబు, చావా వెంకటరామారావు, దుద్దుకూరి నాగేశ్వరరావు, దుద్దుకూరి కృష్ణప్రసాద్, నున్నా శేషయ్య, చాపలమడుగు రామ్మూర్తి, మోదుగు రామక్రిష్ణ, బానోత్ చిన్నా, రెడ్డిబోయిన రాము, తాళ్లూరి రామారావు, సీతాకుమారి, సేవ్యా, తదితరులు పాల్గొన్నారు.

బడి బస్సు పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీలో నిర్వహిస్తున్న పీవీకాలనీలో స్కూల్‌లో బస్సు టెండర్ అర్ధంతరంగా ముగియడంతో విద్యార్థులు పడుతున్న ఆగచాట్లకు 'బస్సు లేక విద్యార్థుల అవస్థలు' అనే కథనం సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. దీంతో ఏరియా జీఎం దుర్గం రాంచందర్ వెంటనే బస్సుల పునరుద్ధరణకు డీజీఎం, స్థానిక అధికారులతో మాట్లాడి సమస్య తీవ్రతను తెలుసుకుని అద్దె బస్సుల యాజమాన్యంతో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించారు. దీంతో విద్యార్థులకు సోమవారం నుంచి హయర్ బస్సుల లీజును నెల కాలం పొడిగిస్తూ ఆదేశాలివ్వడంతో పాటు మరో బస్సును కొత్తగూడెం డిగ్రీ కాలేజీ నుంచి తీసుకొచ్చి నడిపేందుకు చర్యలు చేపట్టారు. అనంతరం సింగరేణి హెచ్ఎం స్వరూపకు బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ దిశగా విద్యార్థులకు బస్సు పునరుద్ధరణ సమాచారం అందించాలని ఆదేశాలిచ్చారు. ఈ విషయమై డీజీఎం(పర్సనల్) సలగల రమేశ్‌ను వివరణ కోరగా.. బస్సులు సోమవారం నుంచి యథావిధిగా నడుస్తాయని జీఎం, ఉన్నతాధికారులతో చర్చించి బస్సును నెలరోజుల పాటు పొడిగించినట్లు తెలిపారు. సింగరేణి అధికారులు వెంటనే స్పందించి బస్సులు పునరుద్ధరించడం పట్ల కార్మిక నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యోగాల పేరుతో మోసపోయిన బాధితుల ఆందోళన

రూ.2 కోట్లు కాజేసిన వ్యక్తి బంధువును నిలదీసిన బాధితులు


తులసీరాం ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

కారేపల్లి: ఉద్యోగాల పేరుతో రూ.2 కోట్లు గోల్‌మాల్ చేసిన కేసులో నిందితుడిని కారేపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంగతి విదితమే. కాగా.. మధ్యవర్తిగా ఉన్న, నిందితుడి బావ అయిన పోలంపల్లి గ్రామానికి చెందిన తులసీరాం ఇంటి ఎదుట బాధితులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఇటీవల మండలంలోని భాగ్యనగర్‌తండా గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి సుమారు రూ.2 కోట్లు కొల్లగొట్టిన సంగతి తెలిసిందే. కాగా.. నిందితుడు ప్రేమ్‌కుమార్ బావ అయిన, పోలంపల్లి గ్రామానికి చెందిన తులసీరాం బాధితులకు మధ్యవర్తిగా ఉన్నాడని, పెద్దమనుషుల సమక్షంలో ఆదివారం పోలంపల్లి గ్రామంలో బాధితులు పంచాయతీ నిర్వహించారు. పోలంపల్లికి చెందిన గుగులోతు రమేశ్‌కు ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఉద్యోగం ఇప్పిస్తానని ప్రేమ్‌కుమార్ రూ.63 లక్షలు, కోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని అజ్మీర దివ్య నుంచి రూ.17 లక్షలు వసూలు చేశాడు. అనంతరం ఉద్యోగాలు వచ్చాయని.. ఇప్పుడిప్పుడే ఉద్యోగాల్లో జాయిన్ కావొద్దని, నెల జీతం వస్తుందని నమ్మబలికి.. కొన్ని నెలల వరకు వారిద్దరికి వేతనం ఇచ్చాడు. దీనికి సంబంధించి పెద్దమనుషుల సమక్షంలో దఫాలవారీగా పంచాయతీ నిర్వహించగా.. గుగులోతు రమేశ్‌కు రూ.38 లక్షలు, అజ్మీర దివ్యకు రూ.17 లక్షలు ఇవ్వనున్నట్లు తేలింది. కాగా.. మధ్యవర్తిగా ఉన్న తులసీరాంను మిగిలిన పైకం చెల్లించాలని ఒత్తిడి తేవటంతో.. రమేశ్‌కు రూ.10 లక్షలు, దివ్యకు రూ.5 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. దీనికి బాధితులు నిరాకరించి, బాధిత కుటుంబ సభ్యులంతా తులసీరాం ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న కారేపల్లి ఎస్ఐ రాజారాం ఘటనా స్థలానికి చేరుకొని.. ఆందోళనకారులకు సర్దిచెప్పి, తులసీరాంను కారేపల్లి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు.

రూ.2 లక్షల విలువైన కలప పట్టివేత

నలుగురిపై కేసు నమోదు


అధికారులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్, కలప

ఇల్లెందు(టేకులపల్లి): అక్రమంగా తరలిస్తున్న విలువైన నారవేప కలపను ఫారెస్టు అధికారులు పట్టుకున్నారు. ఫారెస్టు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. టేకులపల్లి మండలం తొమ్మిదోమైలుతండా పంచాయతీ కోటల్ల గ్రామం సమీపాన ఆదివారం తెల్లవారుజామున నారవేప కలపను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్నట్లు తెలిసిన సమాచారం మేరకు ఎఫ్ఆర్ఓ బీవీ.ప్రసాద్ ఆధ్వర్యాన సెక్షన్ ఆఫీసర్ రంగ్యా, సిబ్బంది ఆకస్మికంగా దాడి చేసేందుకు వస్తున్నారు. ఈక్రమంలో గమనించిన కలప రవాణాదారులు ట్రాక్టర్‌లో కలపను వదిలేసి అక్కడి నుంచి పారిపోయారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు విచారణ చేపట్టగా.. పారిపోయిన వారు గన్నా, భద్రు, రవి, ప్రభాకర్‌లుగా గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు. వీటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని తెలిపి, దుంగలను ట్రాక్టర్‌తో సహా ఇల్లెందు డిపోకు తరలించారు.

టేకు కలప స్వాధీనం..

పాల్వంచరూరల్: స్థానిక పట్టణంలోని సీకాలనీ గేటు వద్ద అక్రమంగా ద్విచక్రవాహనంపై రూ.10 వేల విలువ గల టేకు ముక్కలను ఓ వ్యక్తి ఆదివారం తరలిస్తున్నాడు. ఈక్రమంలో అటవీశాఖ సిబ్బందిని గమనించి కలపతో పాటు ద్విచక్రవాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయాడు. దీంతో కలపను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రేంజర్ అనిల్‌కుమార్ తెలిపారు.

ప్రమాద ఘటనపై ఫిర్యాదు


ప్రమాదానికి కారణమైన లారీ

దమ్మపేట: బైక్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో ఒక తల్లితో పాటుగా ఆమె ఇద్దరు కుమార్తెలు దారుణంగా మృతి చెందిన దుర్ఘటనపై మృతురాలి తల్లి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. శనివారం రాత్రి మండలంలోని మందలపల్లి గ్రామ శివారులో ప్రభు నర్సరీ సమీపాన బైక్‌ను ఓ లారీ ఢీకొట్టగా తల్లితో పాటుగా ఇద్దరు కుమార్తెలు మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం, లింగగూడెం గ్రామానికి చెందిన పందేటి వెంకటేశ్వరరావు, మరియమ్మ దంపతుల కుమార్తె లక్ష్మికి, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం, మల్లేల గ్రామానికి చెందిన వంగూరి మారేశ్వరరావుతో గత పదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు శరణ్యశ్రీ(8), షణ్మితశ్రీ(6) ఉన్నారు. కాగా, భర్తతో విభేదాల కారణంగా పందేటి లక్ష్మి (24) తన పిల్లలతో కలసి గత కొన్నేళ్లుగా పుట్టింట్లో ఉంటుంది. ఈక్రమంలో గత పది నెలల క్రితం నుంచి ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరు మండలం, చీమలపాడు గ్రామానికి చెందిన చీపు బాలకృష్ణ (22), లక్ష్మి ఆమె పిల్లలతో కలసి ఉంటున్నాడు. ఈనేపథ్యాన కుటుంబ పోషణ కోసం ఒక వారం క్రితం అశ్వారావుపేట గ్రామ శివారులో గల కోళ్ల ఫారంలో నెలవారి జీతానికి పనిలో చేరారు. శనివారం బాలకృష్ణ తన బైక్‌పై లక్ష్మి, ఆమె కుమార్తెలతో కలసి మిత్రుడి వివాహ నిమిత్తం ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా విసన్నపేట మండలం, చంద్రుపట్ల గ్రామం వెళ్లాడు. వివాహం అనంతరం తిరుగు ప్రయాణంలో రాత్రి 8 గంటల సమయాన దమ్మపేట మండల పరిధిలోని మందలపల్లి గ్రామ శివారులోని ప్రభు నర్సరీ సమీపానికి చేరుకోగా సత్తుపల్లి నుంచి అశ్వారావుపేట వైపుకు రాజస్తాన్‌కు చెందిన లారీని డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యంగా లారీని నడుపుతూ బైక్‌ను వెనక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న నలుగురు కింద పడగా.. లక్ష్మి, ఆమె పిల్లలపై నుంచి లారీ వెళ్లడంతో వారి తల, శరీర భాగాలు ఛిద్రం అయ్యాయి.బాలకృష్ణ కాలి వెళ్లపై నుంచి లారీ వెళ్లడంతో స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు, పోలీసులు దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఛిద్రమైన మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అశ్వారావుపేట మార్చురీకి తరలించారు. ఆదివారం మృతురాలి (లక్ష్మి) తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేయనున్నామని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. క్షతగాత్రుడు బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, అతడి కుటుంబ సభ్యులకు కూడా సమాచారం అందించామని ఎస్సై తెలిపారు. కాగా, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ ఆదివారం దమ్మపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించి ప్రమాద వివరాలపై ఆరా తీశారు.

గర్భం దాల్చిన మైనర్..

కొత్తగూడెం రూరల్: టేకులపల్లి మండలంలోని ఒక గ్రామంలో మైనర్ బాలిక గర్భం దాల్చిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక అదే మండలానికి చెందిన తన సమీప బంధువైన మైనర్ బాలుడితో గత కొన్ని రోజులుగా ప్రేమాయనం కొనసాగింది. ఈ విషయం పెద్దలకు తెలియడంతో ఇరు వర్గాల వారికి వివాహం చేద్దామని నిర్ణయించారు. కానీ వయసు అడ్డురావడంతో వివాహం వాయిదా వేశారు. ఈ క్రమంలో మైనర్ బాలికకు కడుపులో తీవ్ర నొప్పి రావడంతో కొత్తగూడెంలోని ఓ ఆస్పత్రికి ఆపై జిల్లా మాతా శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి బాలిక గర్భవతి అని నిర్ధారించారు. ఈ విషయం ఐసీడీఎస్ అధికారుల దృష్టికి వెళ్లడంతో వారు మైనర్ బాలికతో మాట్లాడి వివరాలు సేకరించి నమోదు చేశారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్యం క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

లారీ డ్రైవర్‌పై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: నిర్లక్ష్యంగా లారీ నడిపి, ప్రమాదానికి కారణమైన ఓ డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై శ్రీరాముల శ్రీను కథనం ప్రకారం.. కరీంనగర్ నుంచి కాకినాడ వైపుకు గ్రానైట్ లోడుతో వెళ్తున్న ఓ లారీ ఆదివారం తెల్లవారుజామున అశ్వారావుపేట గ్రామ శివారులో ఎదురుగా వచ్చే మరో లారీని తప్పించబోయి చెట్టును ఢీ కొట్టింది. దీంతో లారీ ముందు భాగం ధ్వంసం కాగా, డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. ఈ సమాచారం అందుకున్న బ్లూకోట్ కానిస్టేబుళ్లు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించాక మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరు చెందిన లారీ డ్రైవర్ చీపిరి సమ్మయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మృతదేహాల మౌన వేదన


అశ్వారావుపేట మార్చురీలో మృతదేహాలు

అశ్వారావుపేట: నా అన్నవాళ్లు ఎవరూ రాక మృతదేహాలు 13 గంటల పాటు మార్చురీలో మౌన వేదన అనుభవించాయి. దమ్మపేట మండలంలో శనివారం రాత్రి 8 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీ, ఇద్దరు కూతుర్లు మృతిచెందిన విషయం విదితమే. మృతదేహాలను అశ్వారావుపేటలో విద్యుత్ సౌకర్యం కూడా లేని పురాతన మార్చురీకి తరలించగా ఆదివారం మధ్యాహ్నం 1 గంట వరకు మృతుల బంధువులు ఎవరూ చేరుకోలేదు. మృతురాలు లక్ష్మి స్వగ్రామం లింగగూడెం.. అశ్వారావుపేటకు 55 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ప్రమాదం జరిగిన రాత్రే పోలీసులు సమాచారం అందించినా.. మృతుల బంధువులు దమ్మపేట పోలీస్ స్టేషన్‌కు వచ్చి భర్త తరఫు వారితో చర్చలు జరిపారే తప్ప మృతదేహాలను చూసేందుకు మధ్యాహ్నం వరకు ఎవరూ రాలేదు. ఎండ వేడికి మృతదేహాల నుంచి దుర్వాసన వెదజల్లుతున్నాయి. అంతేకాక ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడి కోసం కూడా అతడి కుటుంబసభ్యులు ఎవరూ రాలేదు. కాగా, లక్ష్మి బంధువులు ఆదివారం మధ్యాహ్నం మార్చురీ వద్దకు వచ్చి మృతదేహాలను తీసుకెళ్లారు.

రామాలయంలో 'గంట' అపహరణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఊట్లపల్లి గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న రామాలయంలో శనివారం అర్ధరాత్రి సమయాన గుర్తు తెలియని దుండగులు ఓ ఇత్తడి గంటను అపహరించారు. ఆదివారం ఉదయం ఆలయంలోకి వెళ్లిన పురోహితుడికి గర్భగుడి దగ్గర ఉండే సుమారు 15 కేజీలు ఉండే ఇత్తడి గంట కనిపించలేదు. దీంతో ఆలయ కమిటీ బాధ్యులకు చెప్పడంతో వారు చోరీ ఘటనపై స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు స్థానిక ఎస్సై శ్రీను వివరాలు సేకరించి, దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కొత్తగూడెం రూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఇల్లెందు క్రాస్ రోడ్డు ప్రధాన రహదారి పక్కన గుర్తు తెలియని ఓ వ్యక్తి ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. అక్కడ చూసిన కొందరు స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఇల్లెందు(టేకులపల్లి): బైక్ అదుపు తప్పి కింద పడడంతో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. బోడు ఎస్సై పొడిశెట్టి శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన బోళ్ల లక్షమయ్య (33) తన భార్య, పిల్లలతో కలిసి ఈనెల 4న కొప్పురాయి పంచాయతీ కొత్తూరు గ్రామంలో జరుగుతున్న ఓ పెళ్లి వేడుకకు హాజరయ్యారు. అదేరోజు కిష్టారంలోనూ మరో పెళ్లి ఉండడంతో తన భార్య, పిల్లలను కొత్తూరులోనే ఉంచి తానొక్కడే బైక్‌పై వెళ్లాడు. ఆ తర్వాత తన భార్య, పిల్లలను తీసుకెళ్లేందుకు కొత్తూరుకు వస్తుండగా.. ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. దీంతో గమనించిన చుట్టుపక్కల వారు ఫోన్ చేసి తెలపడంతో కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మంలోని ఓ ప్రవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. భార్య మమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి ఉద్యోగి...


వెంకటేశ్వర్లు(ఫైల్)

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామ పంచాయతీలోని పాయం మంగయ్య గుంపు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పాయం మంగయ్య కుమారుడు, సింగరేణి ఉద్యోగి పాయం వెంకటేశ్వర్లు(51) మందమర్రిలో రోడ్డు ప్రమాదంలో ఆదివారం మృతి చెందాడు.రోజువారీ లాగే వెంకటేశ్వర్లు తన బైక్‌పై వెళ్లి విధులు నిర్వహించుకుని తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు కిందపడడంతో తలకు బలమైన గాయమై మృతి చెందాడు. దీంతో వెంకటేశ్వర్లు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగా స్థానికులు, మిత్రులు నివాళులు అర్పించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ ఖమ్మం to వరంగల్ రోడ్ నర్సింహులుపేట స్టేజి దగ్గర DTCP Layout Plots గజం కేవలం రూ॥ 3500/- మాత్రమే. Spot Registration. 9705902442, 7993841894 [M-1185025]

Wanted

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185024]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం జీ: 18K. Ph: 9640258899/ 9640468899 [H-799863]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	: 9010299957
	9705444182
కొత్తగూడెం	: 9010223783
పాల్వంచ	: 9705444183
భద్రాచలం	: 9951602914
మణుగూరు	: 9705944416
సత్తుపల్లి	: 9652868642
మధిర	: 9949927792

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా...

ఆ డబ్బులు మావే ఇచ్చేయండి

- రూ.51,99,800 నగదుతోపాటు చెక్కులు కూడా ఇవ్వండి
- రామోజీరావుకి చెందిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ లొల్లి

సాక్షి, విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విశాఖపట్నంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా.. ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.51,99,800 నగదుతోపాటు రూ.36,88,675 విలువైన 51 చెక్కులను స్వాధీనం చేసుకున్న వ్యవహారంలో పచ్చ పత్రికాధినేత రామోజీరావుకు చెందిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ డ్రామాలకు తెరలేపింది. ఆ నగదుతోపాటు చెక్కులు కూడా తమవేనని చెబుతున్న మార్గదర్శి ఇందుకు సంబంధించిన ఆధారాలు చూపమంటే చూపడం లేదు. దీంతో ఈ సొమ్ము మార్గదర్శిది కాదని.. టీడీపీ నేతలు ఓట్ల కొనుగోలుకు తరలిస్తున్న నగదని అంతా చెబుతున్నారు. ఇప్పటికే ఈ నగదుకు సంబంధించి కేసు కూడా నమోదైంది. అంతేకాకుండా ఈ వ్యవహారం ఆదాయ పన్ను శాఖ పరిధిలోకి వెళ్లిపోయింది. ఆధారాలు చూపించి నగదును తీసుకునే అవకాశం ఉన్నా ఆ పనిచేయకుండా జిల్లా ఎన్నికల యంత్రాంగం చుట్టూ మార్గదర్శి సిబ్బంది తిరగడం చర్చనీయాంశంగా మారింది.

మళ్లీ జగనే సీఎం కావాలని...

- భద్రాచలం రామాలయానికి అభిమానుల పాదయాత్ర



బూర్గంపాడు: ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ ఆయన అభిమానులు పాదయాత్ర చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామం నుంచి భద్రాచలం రామాలయానికి ఆదివారం పాదయాత్రగా వెళ్లారు. మొదట రెడ్డిపాలెం రామాలయంలో, ఆ తర్వాత భద్రాచలం రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా వందలాది మంది అభిమానులు పాదయాత్రగా వెళ్లి భద్రాద్రి రామయ్యను దర్శించుకున్నారు. ఐదేళ్లుగా అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే ఆయనకు శ్రీరామరక్షగా నిలుస్తాయని వారు అన్నారు.

బాబును నమ్మితే పులికి బలే

ప్రజలకు మంచి జరుగుతుంటే చూడలేని శాడిస్టు.. కొనకనమిట్ల 'మేమంతా సిద్ధం' సభలో ఏపీ సీఎం జగన్



టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల 2014 మేనిఫెస్టో చూపిస్తూ.. వారి మోసపూరిత హామీలను వివరిస్తున్న సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ''ప్రకాశం జిల్లా పొదిలిలో ఈరోజు ఇసుక వేసినా రాలనంతగా జనసముద్రం, ప్రజా కెరటం కనిపిస్తోంది. మంచి చేసిన మన ప్రభుత్వానికి మద్దతుగా, ఆ మంచిని కొనసాగించేందుకు చేయీ చేయీ కలిపి చేస్తున్న నినాదమే సిద్ధం.. సిద్ధం! ప్రజల అజెండాతో మనం, జెండాలు జతకట్టి వారు తలపడుతున్న ఈ ఎన్నికల్లో పేదల వ్యతిరేకులను ఓడించి ఇంటింటా అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగించేందుకు మీరంతా సిద్ధమేనా?'' అని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. 10వ రోజు బస్సు యాత్ర సందర్భంగా ప్రకాశం జిల్లా మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కొనకనమిట్ల జంక్షన్ వద్ద ఆదివారం జరిగిన ''మేమంతా సిద్ధం'' బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడారు. ఎండ నిప్పులు చెరుగుతున్నా భారీ ఎత్తున తరలివచ్చిన జనసందోహాన్ని ఉద్దేశించి సీఎం మాట్లాడారు. 'ప్రజల రాజ్యాన్ని, అవ్వాతాతల సంక్షేమ రాజ్యాన్ని, రైతు రాజ్యాన్ని, మహిళా పక్షపాత రాజ్యాన్ని, పిల్లల అభివృద్ధి రాజ్యాన్ని ధ్వంసం చేసేందుకు వస్తున్న మూడు పార్టీల కూటమిని అడ్డుకునేందుకు మీరంతా సిద్ధమేనా? ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలను, ఎంపీలను ఎన్నుకునేందుకు జరుగుతున్నవి కాదు. గత ఐదేళ్లుగా బాగుపడ్డ మీ పిల్లలు బడులు, చదువులు, అక్కచెల్లెమ్మల సాధికారత, అవ్వాతాతల సంక్షేమం, రైతుకు అందుతున్న భరోసా, సామాజిక న్యాయం.. ఇవన్నీ కొనసాగి మరో రెండు అడుగులు ముందుకు వేయాలా? లేక మోసపోయి వెనక్కు వెళ్లాలా? అన్నది నిర్ణయించే ఎన్నికలు ఇవి. ఈ ఎన్నికలు మన భవిష్యత్తును నిర్దేశిస్తాయి. రెండు అడుగులు ముందుకు వేయాలా? లేక మళ్లీ మోసపోయి వెనక్కు వెళ్లాలా? అనే అంశాన్ని నిర్ణయించే ఎన్నికలు అని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరుతున్నా' అని పేర్కొన్నారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఫ్లాష్ బ్యాక్‌లోకి వెళ్దామా?

మన జెండా తలెత్తుకుని రెపరెపలాడుతుంటే.. వారి జెండా మరో నాలుగు జెండాలతో జత కట్టినా కూడా ఎగరలేక కింద పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. చంద్రబాబు, కూటమి చరిత్ర ఏమిటి? 2014లో ఏం చెప్పారో ఒక్కసారి ఫ్లాష్ బ్యాక్‌లోకి వెళ్దామా? ముఖ్యమైన హామీలు ఒక్కసారి చూద్దాం. రూ.87,612 కోట్ల రైతుల రుణమాఫీ చేశాడా? రూ.14,205 కోట్ల పొదుపు సంఘాల రుణాలు ఒక్క రూపాయి అయినా చేశాడా? ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు బ్యాంకులో డిపాజిట్ చేశారా? ఇంటింటికీ ఒక ఉద్యోగం లేదంటే రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నాడు. 60 నెలల్లో నెలకు రూ.2 వేల చొప్పున రూ.1.20 లక్షలు మీ ఇంటికి వచ్చాయా? పేదలకు 3 సెంట్ల స్థలం కథ దేవుడెరుగు ఒక్క సెంటు స్థలమైనా, కనీసం ఒక్కరికైనా ఇచ్చాడా? రూ.10 వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్, చేనేత, పవర్ లూమ్స్ రుణాల మాఫీ.. అయ్యాయా? మహిళల రక్షణకు ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేశాడా? రాష్ట్రాన్ని సింగపూర్‌కు మించి అభివృద్ధి చేస్తామన్నాడు చేశాడా? ప్రతి నగరంలోనూ హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు. మీ పొదిలిలో ఏమన్నా హైటెక్ సిటీ కనిపిస్తోందా? మార్కాపురంలో అయినా కనిపిస్తోందా? పోనీ ఒంగోలులో కనిపిస్తోందా? పోనీ ప్రత్యేక హోదా ఇచ్చారా? ఇదే చంద్రబాబు మరోసారి కూటమి కట్టి మళ్లీ వస్తున్నాడు. చంద్రబాబును నమ్మడం అంటే పులి నోట్లో తలకాయ పెట్టడమే. ఇలాంటి మోసగాళ్ల బారి నుంచి రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకునేందుకు మీరంతా సిద్ధమేనా? సెల్ ఫోన్ టార్చ్ లైట్ వెలిగించి సిద్ధమే అని గట్టిగా నినదించండి.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అడవి తల్లిని వీడం.. బయటకెళ్లి బతకలేం

▶ మొదటి పేజీ తరువాయి

బలవంతంగా అడవి బయటకు తరలించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని ఆందోళన చెందుతున్నారు.

ఎన్టీసీఏ ద్వారా పునరావాస ప్యాకేజీ.. అయినా చెంచులు విముఖం

అడవి లోపల నివసిస్తున్న వారిని బయటకు తరలిస్తే ఒక్కో కుటుంబానికి ఎన్టీసీఏ ద్వారా రూ.15 లక్షల పునరావాస ప్యాకేజీ అందించనుంది. వీరి పునరావాసం కోసం నాగర్‌కర్నూల్ జిల్లాలోని పెద్దకొత్తపల్లి మండలం బాచారం వద్ద అటవీశాఖకు చెందిన స్థలాన్ని కేటాయించారు. రూ.15 లక్షల ప్యాకేజీ వద్దనుకుంటే బాచారం వద్ద 220 గజాల స్థలంలో ఇంటి నిర్మాణం, జీవనోపాధి కోసం 5 ఎకరాల వ్యవసాయ భూమిని అందజేస్తారు. సార్లపల్లిలో 269 కుటుంబాలు ఉండగా, వీరిలో 83 కుటుంబాలు మాత్రమే చెంచులు కాగా, మిగతా వారిలో ఇతర వర్గాల సంఖ్యే ఎక్కువగా ఉంది. ఎన్టీసీఏ ప్యాకేజీకి ఇప్పటి వరకు 186 కుటుంబాలు అంగీకరించగా, వీరిలో చెంచు కుటుంబాలు ఆరు మాత్రమే ఉన్నాయి. అడవి నుంచి బయటకు తరలింపునకు మెజార్టీ శాతం చెంచు కుటుంబాలు విముఖత వ్యక్తం చేస్తున్నాయి.

కనీస సౌకర్యాలు లేకున్నా..

నల్లమల అటవీప్రాంతంలో మొత్తం 88 ఆవాసాల్లో చెంచులు నివసిస్తున్నారు. వీటిలో 20 ఆవాసాలు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని కోర్ ఏరియాలో ఉన్నాయి. అడవిలో అటవీ శాఖ ఆంక్షల నేపథ్యంలో ఇక్కడి చెంచులు కనీస మౌలిక సదుపాయాలకు సైతం నోచుకోవడం లేదు. టైగర్ రిజర్వ్ ప్రాంతం కావడంతో పులులు, వన్యప్రాణుల సంరక్షణను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. అడవిలో ఉన్న అప్పాపూర్ గ్రామ పంచాయతీ మినహా మరెక్కడా చెంచుపెంటల్లో కనీసం అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, వైద్యశాల లేవు. తాగునీటికి సైతం ఎలాంటి సురక్షిత మంచినీటి వ్యవస్థ అందుబాటులో ఉండదు. స్థానికంగా సోలార్ బోరు ద్వారా వచ్చే నీటితో పాటు కుంటలు, చెలిమెల నీటినే చెంచులు నిత్యం తాగేందుకు వినియోగిస్తున్నారు.



మల్లాపూర్ పెంటలోని చెంచుల ఆవాసాలు

మేం అడవిలోనే ఉంటాం.. బయటకు పోలేం



ఏళ్లుగా తాతల కాలం నుంచి అడవినే నమ్ముకుని బతుకుతున్నాం. మేం బయటకు పోయి జీవించలేం. మా వల్ల వన్యప్రాణులు, పులులకు ఎలాంటి హాని లేదు. ఇప్పుడు కూడా ఉండదు. దయచేసి మమ్మల్ని అడవి నుంచి విడదీయద్దు. మేమంతా అడవిలోనే ఉంటాం.

–చిగుర్ల లింగమ్మ, చెంచు మహిళ, సార్లపల్లి, అమ్రాబాద్ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా

మమ్మల్ని ఆగం చేయొద్దు..



అడవిలో జీవిస్తూ ప్రశాంతంగా ఉన్న మమ్మల్ని ఆగం చేయద్దు. మా వాళ్లు బయటి ప్రపంచంలో బతకలేరు. బాచారం లాంటి మైదాన ప్రాంతాలకు తరలిస్తే అక్కడ ఏజెన్సీ నియమాలు, హక్కులు వర్తించవు. మైదాన ప్రాంతాల్లో ఉన్న చెంచులు మాకంటే దుర్భరమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారు. అడవి నుంచి బయటకు పంపితే చెంచుల ఉనికికే ప్రమాదం ఉంది.

– కుడుముల మల్లేశ్, చెంచు యువకుడు, సార్లపల్లి గ్రామం

స్వచ్ఛందంగా ముందుకు వస్తేనే తరలింపు



టైగర్ రిజర్వ్ ప్రాంతాల్లో అమూల్యమైన వన్యప్రాణుల సంరక్షణ కోసం, వాటికి ముప్పును నివారించేందుకే స్థానికులకు మరోచోట పునరావాసం కల్పిస్తున్నాం. అడవిలో వారికి ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు సాధ్యం కాదు. పునరావాస కాలనీల్లో అన్ని వసతులు కల్పిస్తాం. రీలొకేషన్‌లో ఎలాంటి ఒత్తిడి లేదు, స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారినే తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– రోహిత్ గోపిడి, డీఎఫ్‌ఓ,నాగర్‌కర్నూల్ జిల్లా

రాష్ట్రం సరఫరా చేసిన బియ్యంలో ఖాప్రా పురుగు

- పలువురు సిబ్బందిపై ఎఫ్‌సీఐ వేటు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నుంచి ఎఫ్‌సీఐకి సరఫరా అయిన బియ్యంలో ఖాప్రా అనే పురుగు ఉన్నట్లు తేలింది. ఈ మేరకు చెన్నైలోని ఎఫ్‌సీఐ జోనల్ కార్యాలయానికి ఫిర్యాదులు అందాయి. దీంతో స్పందించిన సంస్థ.. తెలంగాణకు చెందిన ఆరుగురు ఎఫ్‌సీఐ మేనేజర్లు, 14 మంది టెక్నికల్ సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేసింది. తెలంగాణ నుంచి తమిళనాడు, కేరళ, కర్ణాటకలోని పలు ప్రాంతాలకు కస్టమ్ మిల్లింగ్ రైస్ కింద పంపిన బియ్యం వ్యాగన్లకుగాను కొన్నింటిలో ఖాప్రా పురుగు ఉన్నట్లు ఫిర్యాదులు రావడంతో బాధ్యులపై ఎఫ్‌సీఐ ఈ మేరకు చర్యలు చేపట్టింది.

బాధ్యులందరికీ నోటీసులు

▶ మొదటి పేజీ తరువాయి

నియమిస్తూ గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. బీఆర్‌కేఆర్ భవన్‌లోని 7వ అంతస్తులో కమిషన్ ఆఫ్ ఎంక్వైరీకి కేటాయించిన కార్యాలయంలో ఆదివారం జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి న్యాయవిచారణ ప్రక్రియ ప్రారంభించి ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి, ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థల సీఎండీ ఎస్ఏఎం.రిజ్వీ, ఇతర అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గడువు మేరకు 100 రోజుల్లోగా నివేదిక సమర్పిస్తామన్నారు. నాటి నిర్ణయాల్లో భాగస్వాములైన అధికారులే ఇంకా విద్యుత్ సంస్థల డైరెక్టర్లుగా కొనసాగుతూ న్యాయ విచారణలో కమిషన్‌కు సహకరిస్తున్నారని, రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే ఫైళ్లు తారుమారు చేసినట్టు ఆరోపణలూ వచ్చాయని విలేకరులు జస్టిస్ నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, మూడు ఒప్పందాలకు సంబంధించిన అన్ని ఫైళ్లు తమ కార్యాలయానికి చేరాయని ఆయన బదులిచ్చారు. వాటి ప్రాథమిక పరిశీలన కూడా పూర్తయిందన్నారు. అవసరమైతే ఇంకా ఫైళ్లు అడుగుతామని చెప్పారు. కాంపిటీటివ్ బిడ్డింగ్‌కి బదులుగా నామినేషన్లు, లిమిటెడ్ టెండర్ల పేరుతో రూ.వందల కోట్ల సివిల్ పనులు కాంట్రాక్టర్లకు అప్పగించిన అంశంతోపాటు యాదాద్రి విద్యుత్ కేంద్రం భూసేకరణలో అవకతవకతలపై సైతం విచారణ నిర్వహిస్తారా? అని విలేకరులు ప్రస్తావించగా ఆయన సమాధానం దాటవేశారు.

జిల్లా వార్తలు

సాహస వీరుడికి అవార్డు



అవార్డు అందుకుంటున్న కృష్ణానాయక్

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం కాలనీ గ్రామానికి చెందిన ఆలిండియా భారత బంజారా రత్న సాహస వీర్ పురస్కార అవార్డు గ్రహీత భూక్యా కృష్ణ నాయక్‌కు మరో అవార్డు దక్కింది. శనివారం ముంబయ్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆలిండియా బంజారా సేవాసంఘ్(ఏఐబీఎస్ఎస్) అధ్యక్షుడు శంకర్ పవార్, కర్ణాటక గాయకుడు సుభాష్ రాథోడ్ చేతుల మీదుగా అఖండ భారత్ బంజారా భూషణ్ శస్త్రవీర్(స్టంట్) అవార్డు అందుకున్నాడు. ఈ సందర్భంగా కృష్ణ నాయక్‌ను ఘనంగా సత్కరించారు.

రెండు తలలు.. ఆరు కాళ్లు..

వింతగా దూడ జననం.. వెంటనే మృతి



వింత ఆకారంలో జన్మించిన దూడ

చర్ల రూరల్: భద్రాద్రి జిల్లా చర్ల మండలంలోని జి.పి.పల్లి గ్రామంలో ఆదివారం బోరా శ్రీనివాసరెడ్డి అనే రైతుకు చెందిన ఆవు రెండు తలలు.. ఆరు కాళ్లు ఉన్న లేగదూడకు జన్మనిచ్చింది. అయితే వింత ఆకారంలో పుట్టిన ఈ దూడ గంట తర్వాత చనిపోయిందని రైతు తెలిపాడు. దూడను చూసేందుకు గ్రామస్తులు భారీగా తరలివచ్చారు. జన్యులోపంతోనే దూడలు ఇలా జన్మిస్తాయని ప్రభుత్వ పశు వైద్యాధికారి రవీందర్ తెలిపారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

పాల్వంచరూరల్ : పాల్వంచ మండలంలోని కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా వచ్చిన వారు.. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 283 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.10,420 ఆదాయం లభించగా, 140 మంది బోటు షికారు చేయడంతో టూరిజం కార్పొరేషన్‌కు రూ.8,410 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

కూల్ కూల్‌గా.. జర్నీ!

వేసవిలో ఏసీ బస్సులకు పెరిగిన డిమాండ్

- చార్జీలు ఎక్కువైనా లెక్కచేయని ప్రయాణికులు
- రీజియన్ నుంచి అధికంగా హైదరాబాద్‌కే
- నిత్యం 2వేల మందిపైగా ప్రయాణిస్తున్న వైనం
- లాభాల బాటలో ఆర్టీసీ





రాజధాని, లహరి ఏసీ బస్సులు

చుంచుపల్లి: ఏప్రిల్ ఆరంభంలోనే భానుడు ప్రతాపానికి 43 డిగ్రీలకుపైగా పగటి ఉష్ణోగ్రతను నమోదవుతున్న తరుణంలో ఒకవైపు నిప్పులు చెరుగుతున్న ఎండలతో పాటు మరోవైపు వేడి గాలులు, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ నేపథ్యాన వేసవి తాపం నుంచి ఊరట పొందేందుకు ఆర్టీసీ ప్రయాణికులు సాధారణ బస్సుల కంటే ఏసీ బస్సుల వైపే మొగ్గు చూపుతున్నారు. మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని సుదూర ప్రాంతాలకు ప్రయాణించే వారు సాధారణ ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లో ప్రయాణించాలంటే ఒకింత జంకుతున్నారు. నిన్న, మొన్నటి వరకు పెద్దగా ఆదరణ లేకుండా తిరిగిన ఏసీ బస్సులు కనిపిస్తే చాలు ఠక్కున వాలిపోతున్నారు. దీంతో పక్షం రోజులుగా ఏసీ బస్సులు పరుగులు పెడుతున్నాయి.

రీజియన్‌లో 42 ఏసీ బస్సులు...

ఖమ్మం ఆర్టీసీ రీజియన్ పరిధిలో ఖమ్మం, సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు 7 బస్సు డిపోలు ఉన్నాయి. ఈ డిపోల పరిధిలో అత్యధికంగా బస్ సర్వీసులు హైదరాబాద్ రూట్ వైపుకే నిత్యం తిరుగుతున్నాయి. ఇక భద్రాచలం డిపో నుంచి కూడా సాధారణ సర్వీసులు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు నడుస్తున్నాయి. రీజియన్‌లో 42 ఏసీ బస్సులు అందుబాటులో ఉండగా.. ఖమ్మం డిపోలో అత్యధికంగా 30 ఏసీ బస్సుల్లో 24 రాజధాని బస్సులను హైదరాబాద్ వైపుకు నడుపుతున్నారు. ఇక మిగిలిన 4 లహరి స్లీపర్ ఏసీ బస్సులు బెంగళూరుకు కేటాయించారు. ఇక సత్తుపల్లి డిపో పరిధిలో ఐదు, భద్రాచలంలోని 7 రాజధాని బస్సులను నిత్యం హైదరాబాద్ వైపునకు నడిపిస్తున్నారు. ఇవి ఎక్కువ రాత్రి సమయాల్లో మాత్రమే హైదరాబాద్‌కు నడుస్తుంటాయి.


రోజువారీ ఆదాయం రూ.1.50 కోట్లు..

ఏసీ బస్సుల్లో ప్రయాణికులకు తినటానికి మిల్లెట్స్‌తో పాటు తాగేందుకు మినరల్ వాటర్ బాటిల్‌ను సైతం సిబ్బంది అందిస్తున్నారు. రీజియన్ పరిధిలో ఏసీ బస్సుల్లో నిత్యం 2 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా.. ఏసీ బస్సుల ద్వారా నిత్యం ఆర్టీసీకి రూ.13 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఆదాయం సమకూరుతుందని అధికారులు చెబుతున్నారు. రీజియన్‌లో ఏడు డిపోల పరిధిలో ఆర్టీసీకి రోజువారీ ఆదాయం రూ.1.35 కోట్ల నుంచి రూ.1.50 కోట్ల మేర వస్తుంది. పండగలు, శుభకార్యాల సందర్భంగా ఈ ఆదాయం మరింతగా పెరుగుతుంది. ప్రయాణికుల ఆదరణను దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ అధికారులు మరికొన్ని ఏసీ బస్సులను అందుబాటులో ఉంచాలని, సింగరేణి ప్రాంతాలైన మంచిర్యాల, గోదావరిఖని, కరీంనగర్ రూట్లకు సైతం ఏసీ బస్సులతో పాటు లహరి స్లీపర్ సర్వీసులను నడపాలని పలువురు కోరుతున్నారు.

ఆర్టీసీకి కాసుల వర్షం..

పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ఏసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటంతో ఆర్టీసీకి మంచి ఆదరణ లభించి కాసుల వర్షం కురిపిస్తోంది. సాధారణంగా ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల కంటే ఏసీ బస్సుల్లో చార్జీలు అధికంగా ఉన్నప్పటికీ కూల్.. కూల్‌గా జర్నీ కోసం అదనంగా చెల్లించి సుఖః ప్రయాణాన్ని పొందుతున్నారు. ఎండల నుంచి ఉపశమనం కోసం ప్రయాణికులు ఏసీ బస్సులను ఆశ్రయిస్తుండటంతో అటు ఆక్యుపెన్సీ రేషియో సైతం ఒక్కసారిగా పెరిగింది. ఏసీ బస్సులకు పెరుగుతున్న ఆదరణతో వివిధ డిపోలకు ఆదాయం సైతం రావడం ఆర్టీసీలో ఇది కొంతమేరకు శుభపరిణామంగా అధికారులు చెబుతున్నారు. ప్రయాణికులకు అనుగుణంగా రాత్రి, పగలు వేళల్లో సమయపాలన పాటిస్తూ ఏసీ బస్సులను అధికారులు పలు ప్రాంతాలకు నడుపుతున్నారు. ఖమ్మం రీజియన్‌లోని ఏసీ బస్సుల్లో అధిక శాతం హైదరాబాద్ రూట్‌కు, మరో నాలుగు లహరి ఏసీ స్లీపర్ బస్సులను బెంగళూరు వైపునకు నడుపుతున్నారు. దేశంలోనే ఐటీ కారిడార్‌గా పేరొందిన బెంగళూరుకు నిత్యం జిల్లా నుంచి రాకపోకలు జరిపే ప్రయాణికులు అధికంగా ఉండడంతో లహరి ఏసీ స్లీపర్ సర్వీసులకు సైతం విశేష ఆదరణ లభిస్తోంది.


సాధారణ బస్సుల్లో వెళ్లలేం..



వేసవి తాపానికి దూర ప్రాంతాలకు వెళ్లాలంటే సాధారణ బస్సుల్లో వెళ్లే పరిస్థితి లేదు. చల్లని వాతావరణంలో ప్రయాణాలకు ఏసీ బస్సులు అనువుగా ఉంటాయి. వీటికి ఈమధ్య కాలంలో మరింతగా డిమాండ్ పెరిగింది. ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకొని మరికొన్ని ఏసీ బస్సులను అందుబాటులో ఉంచితే బాగుంటుంది.

– సోము చంద్రమోహనాచారి, కొత్తగూడెం

ఏసీ బస్సుల వైపు మొగ్గు..



ఎండలు ఎక్కువగా ఉండడంతో ఆర్టీసీ ప్రయాణికులు ఏసీ బస్సుల వైపు మొగ్గు చూపుతున్నారు. రీజియన్ పరిధిలో అందుబాటులో ఉన్న 42 ఏసీ సర్వీసులను హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాలకు నిత్యం తిప్పుతున్నాం. ప్రతిరోజు 2 వేల మంది ప్రయాణిస్తుండగా.. బస్సుల కండీషన్‌తో పాటు ప్రయాణికుల శ్రేయస్సు కోసం నిత్యం పర్యవేక్షిస్తున్నాం.

– సీహెచ్.వెంకన్న, ఆర్ఎం

గరం గరం గంజి !

- ఉపవాస దీక్షాపరుల కోసం తయారీ
- ఘుమఘుమలాడే వంటకం



ఉపవాస దీక్షాపరుల కోసం గంజిని తయారు చేస్తున్న దృశ్యం



దీక్షల అనంతరం గంజిని సేవిస్తున్న ముస్లింలు

సత్తుపల్లి: రంజాన్ మాసంలో హలీమ్‌ను తినేందుకు ఎంతగా ఇష్టపడతారో.. గరం గరం గంజిని సేవించేందుకు కూడా అంతే ఇష్టం చూపిస్తారు. ఉపవాస దీక్ష సమయంలో బలవర్థకమైన ఆహారం తీసుకుంటూ ద్రవపదార్థమైన వేడివేడి గంజి(జావ)ను తాగితే మంచిదని భావిస్తారు. ప్రతి ఏటా రంజాన్ మాసంలో మసీదుల్లో ఈ పసందైన ఘుమఘుమలాడే వంటకాన్ని మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు తయారు చేస్తారు. ఉపవాస దీక్షా పరులు ఈ గంజిని సేవిస్తే బడలిక తీరుతుంది. ముస్లిమేతరులు కూడా గంజి రుచులను ఆస్వాదిస్తారు. వేడివేడి గంజిలో బూందీని కలుపుకొని సేవిస్తే ఆ రుచి అద్భుతంగా ఉంటుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సత్తుపల్లి, అశ్వారావుపేట, భద్రాచలం, మధిర, వైరా, కొత్తగూడెం నియోజకవర్గాల్లో గంజిని తయారు చేస్తుంటారు.

గంజి తయారీలో..

మసీదులలో ఉపవాస దీక్షాపరుల కోసం గంజి (జావ)ని తయారుచేస్తారు. బియ్యం రవ్వ, టమాట, ఉల్లిగడ్డ, క్యారెట్, కొత్తిమీర, పచ్చిమిర్చి, మంచి నూనె, పప్పు, ప్రత్యేక మసాలా దినుసులను వినియోగిస్తారు. కొన్ని సమయాల్లో మటన్ ఖైమా కూడా వాడతారు. సుమారు ఐదారు గంటలు బాగా మరిగించి ఘుమఘుమలాడే గంజిని సిద్ధం చేస్తారు.

ఇష్టంగా సేవిస్తా



రంజాన్ మాసంలో ఇఫ్తార్ సమయంలో గంజిని సేవించటం చాలా ఇష్టంగా ఉంటుంది. గంజిలో బూందీ కలుపుకొని సేవిస్తే రుచి మధురంగా ఉంటుంది. నాతో పాటు నా మిత్రులకు కూడా గంజిని తాపిస్తాను. – ఎండీ కమల్‌పాషా, సత్తుపల్లి

చాలా రుచిగా ఉంటుంది



ఉపవాస దీక్ష సమయంలో గంజి సేవిస్తే చాలా రుచిగా ఉంటుంది. ఒంట్లో వేడికూడా తగ్గుతుంది. జామెమసీద్‌లో తయారు చేసే గంజిని ఉపవాస దీక్షాపరులతో పాటు ఇళ్లకు కూడా అందిస్తారు. – ఎస్‌కే రఫీ, సత్తుపల్లి

జాతీయస్థాయి క్రీడల్లో సత్తా



క్రీడాకారులతో కేటీపీఎస్ సీఈలు వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌రావు

పాల్వంచరూరల్ : జాతీయ స్థాయి ఎలక్ట్రిసిటీ బోర్డు క్రీడోత్సవాల్లో కేటీపీఎస్ క్రీడాకారులు సత్తా చాటారు. హరియాణా రాష్ట్రంలోని కురుక్షేత్రంలో గతనెల 29 నుంచి 31వ తేదీ వరకు జరిగిన టోర్నమెంట్‌లో కేటీపీఎస్ ఐదు, ఆరు దశల క్రీడాకారులు క్యారమ్స్ పోటీలో ప్రథమ, చదరంగం, లాన్‌టెన్నిస్‌లో ద్వితీయస్థానాలు కైవసం చేసుకున్నారు. ఇంకా టెన్నికాయిట్‌లో ప్రథమ, షటిల్ బ్యాడ్మింటన్‌లో ద్వితీయ స్థానాలు సాధించారు. కాగా, ప్రతిభ చాటిన క్రీడాకారులను ఆదివారం కేటీపీఎస్ సీఈలు ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు అభినందించారు. కార్యక్రమంలో ఇంజనీర్లు కె.శ్రీనివాస బాబు, యుగపతి, ఎస్.ఎన్ ఎస్.శేఖర్, వై.వెంకటేశ్వర్లు, టి.వీరయ్య తదితరులు పాల్గొన్నారు.